క్లుప్తంగా

సన్మానం



కూకట్‌పల్లి: పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ డబ్ల్యూపీఎస్ స్టేట్ చాంపియన్ కె.నవీన్‌ను బుధవారం టీపీసీసీ సభ్యుడు గొట్టిముక్కల వెంగళరావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు గణేష్, మేడ్చల్ డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రటరీ సూర్య తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల ఆందోళనలను అడ్డుకున్న పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాల పర్మనెంట్ కోసం విధుల బహిష్కరించి పెన్‌డౌన్, చాక్‌డౌన్ నిరసన కార్యక్రమంలో భాగంగా తెలంగాణ మహిళ విశ్వవిద్యాలయంలో కాంట్రాక్టు అధ్యాపకుల చేపట్టిన ఆందోళనను పోలీసులు అడ్డుకున్నారు. బుధవారం ఓయూ కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ ఆధ్వర్యంలో 12 వర్సిటీల అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని ప్లకార్డులను ప్రదర్శించారు. మహిళా వర్సిటీ క్యాంపస్ నుంచి బయటకు వెళ్లేందుకు అధ్యాపకులు యత్నించగా పోలీసులు గేటును మూసి అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన అధ్యాపకులు అక్కడే బైఠాయించి ఉద్యోగాలను పర్మనెంట్ చేసే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపేందర్‌రావు, నర్సింహరావు, శేఖర్‌రెడ్డి, వేల్పుల కుమార్, ధర్మతేజ, విజేందర్‌రెడ్డి, దీపిక, స్రవంతి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపు 'ఆయుష్మాన్ భవ'

సనత్‌నగర్: అమీర్‌పేట–బల్కంపేట రోడ్డులోని అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (జనరల్ హాస్పిటల్)లో ఈ నెల 22న ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ దశరథ్, ఆర్‌ఎంఓ డాక్టర్ వినాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఎన్‌హెచ్‌ఎం మిషన్ డైరెక్టర్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు నిపుణులైన వైద్యులు హాజరై పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఇందులో గర్భ సంబంధిత, పిల్లల వైద్యం, శస్త్ర చికిత్స, చెవి, ముక్కు, గొంతు, కన్ను, మానసిక వ్యాధులకు సంబంధించిన వైద్యులు హాజరవుతారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ పునరుద్ధరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీలో పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన డాక్టర్ అజీజ్ జమాలుద్దీన్ కంప్యూటర్ ల్యాబ్‌ను బుధవారం పునరుద్ధరించారు. రూ.10 లక్షల వ్యయంతో మరమ్మతులు చేపట్టిన ల్యాబ్‌ను వీసీ ప్రొ.రవీందర్ ప్రారంభించారు. రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ ప్రొ.గణేష్, ఇతర అధికారులతో పాటు పూర్వ విద్యార్థులు మేరెడ్డి రవిప్రకాష్, ఎన్‌ఆర్‌ఐ మారోజు వెంకట్ పాల్గొని ప్రసంగించారు.

వైద్యులు నిర్దేశించిన మోతాదు లోనే ఔషధాలు తీసుకోవాలి

అమీర్‌పేట: రోగికి మందులు ఇస్తున్న సమయంలో వాటిని నిశితంగా పరిశీలించాలని డా. గీతాంజలి అన్నారు.ప్రపంచ రోగి సురక్షిత రోజును పురస్కరించుకుని అమీర్‌పేట ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రిలో రెండు రోజుల పాటు జరిగే అవగాహన సదస్సును బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. రోగులకు వైద్యులు సిఫార్సు మేరకు మందులు ఇవ్వడమే కాకుండా ఎక్స్‌పైరీ డేట్‌ను చూసుకోవాలన్నారు. వైద్యులు నిర్దేశించిన మోతాదులోనే మందులు తీసుకోవాలని, త్వరగా జబ్బు నయం కావాలనే ఆత్రుతతో మోతాదు పెంచరాదని సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది.


పిల్లలు, తల్లుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

అమీర్‌పేట: పిల్లలు, తల్లుల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తున్నట్లు అపోలో హెల్త్ అండ్ లైఫ్ స్టైల్స్ లిమిటెడ్ ఎండీ డాక్టర్ సంగీతారెడ్డి తెలిపారు. అమీర్‌పేట హోటల్ మ్యారీ గోల్డ్‌లో ఫీటల్ మెడిసిన్ 'ఆప్టిమైజింగ్ ఫీటల్ ఫలితాల–2023'రెండో ఎడిషన్‌ను సదస్సును బుధవారం ప్రారంభించి మాట్లాడారు. నైపుణ్యం ఉన్న నియోనాటల్ ఫీటల్ మెడిసిన్ నిపుణుల కలయికతో మనకు అందుబాటులో ఉన్న అత్యుత్తమ యంత్రాలతో అద్భుతమైన అవగాహన కల్పిస్తున్నాయన్నారు. 1.8 లక్షల మంది పిల్లలు పుట్టుకతో వైఫల్యాలతో పుడుతారనే అంచనా ఉందన్నారు. ప్రోయాక్టీవ్ స్కీనింగ్ ప్రోటోకాల్‌ల వైపు మనం ముందుకు సాగాలని ఫిజికల్ స్క్రీనింగ్, బ్లడ్ ప్రెజర్, జెనెటిక్స్‌తో సహ ఇతర పరీక్షల కలయికను కచ్చితమైన ప్రోటోకాల్ ఉండాలని తెలిపారు. వైద్య నిపుణులు కృష్ణన్ మనికండన్, లక్ష్మీ రవి, కృష్ణగిరి, బాలాంబ, మాధవీలత పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభించిన డాక్టర్ సంగీతారెడ్డి

గణపతి బప్పా మోరియా



కేపీహెచ్‌బీ 6వ ఫేజ్‌లో కేదార్‌నాథ్ ఆలయ నమూనాలో వినాయక మండప సెట్టింగ్

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని వినాయక చవితి ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. బస్తీలు, కాలనీల్లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల్లో వినాయకుడు ప్రత్యేక పూజలు అందుకుంటున్నాడు. స్థానికులంతా సాయంత్రం మండపాల వద్దకు చేరుకుని విఘ్నేశ్వరుడి సేవలో తరిస్తున్నారు. వివిధ రకాల వంటకాలతో గణపతికి నైవేద్యం సమర్పిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు మండపాల వద్దకు వచ్చి వినాయకులను దర్శించుకుంటున్నారు. – కూకట్‌పల్లి



మూసాపేట వార్డు కార్యాలయం వద్ద సర్దార్ వల్లభాయ్ పటేల్ యూత్ అసోసియేషన్ వినాయకుడు



మూసాపేట మారుతినగర్‌లో నంది వాహనుడైన గణపతితో స్థానికులు



మూసాపేట చిత్తారమ్మ ఆలయం వద్ద భారీ గణపతి వద్ద నిర్వాహకులు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు



ముష్కిపేటలో బాహుబలి గణపతి వద్ద హిందూ సేన యూత్ అసోసియేషన్ సభ్యులు



కమల ప్రసన్ననగర్ కాలనీ ఉత్సవ కమిటీ నిర్వహించిన గణపతి హోమంలో భక్తులు



హైదర్‌నగర్ డివిజన్‌లో జరిగిన పూజలో కార్పొరేటర్లు వెంకటేష్‌గౌడ్, నార్నే శ్రీనివాసరావు



హోమ పూజలో ఈస్ట్‌కాలనీ రెసిడెన్సీ వెల్ఫేర్ ప్రతినిధులతో అధ్యక్షుడు లయన్ కోటిరెడ్డి



గణనాథునికి పూజలు చేస్తున్న అవంతినగర్ తోట సంక్షేమ సంఘం సభ్యులు



ఆదిత్య నగర్ అసోసియేషన్ వినాయక పూజలో బీజేపీ నాయకుడు కొరదాల నరేష్





కూకట్‌పల్లి ప్రగతినగర్, ఫతేనగర్ డివిజన్లలో వినాయక మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్



లక్ష్మీనరసింహస్వామి దేవాలయ గణేశ్ పూజలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్



ఐడీఎల్ చెరువు వద్ద నిమజ్జన శోభ



చిట్టి గణపతిని నిమజ్జనానికి తీసుకొచ్చిన చిన్నారులు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువులో బుధవారం వినాయక విగ్రహ నిమజ్జనం ప్రారంభమైంది. ఇళ్ల, కార్యాలయాలు, కంపెనీల్లో, షాపుల్లో ప్రతిష్ఠించిన గణపతులను గంగమ్మ ఒడికి తరలించారు. 3వ రోజు కావడంతో భారీ ఎత్తున భక్తులు తరలి వచ్చి విగ్రహాలను నిమజ్జనం చేశారు. బ్యాండ్ మేళాల మధ్య వినాయకులను నిమజ్జనానికి తీసుకుని రావడంతో చెరువు వద్ద ట్రాఫిక్ జామ్ అయ్యింది. బుధవారం సుమారు 2వేల వరకు చిన్న విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు అధికారులు తెలిపారు.





చెరువు పరిసరాల్లో భక్తుల కోలాహలం

ఇళ్లు మునిగిపోతున్న వారికి 'డబుల్' ఇళ్లు ఇస్తాం

లోతట్టు ప్రాంతాల్లో ఎమ్మెల్యే, జీహెచ్‌ఎంసీ కమిషనర్ పర్యటన

మోతీనగర్: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఫతేనగర్, అల్లాపూర్ డివిజన్‌లలో లోతట్టు ప్రాంతాలను బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, జోనల్ కమిషనర్ వి. మమత, కార్పొరేటర్లు సబిహా బేగం, పండాల సతీష్‌గౌడ్‌లతో పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారీ వర్షాలతో మునిగిపోతున్న కాలనీలను అభివృద్ధి చేయాలన్నారు. నాలా అభివృద్ధిలో భాగంగా ఇళ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందజేయాలని వినతిపత్రం అందజేశారు. కమిషనర్ రోనాల్డ్ రాస్ మాట్లాడుతూ... త్వరలో టెండర్ ప్రక్రియ ఏర్పాటు చేసి నాలా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. లోతట్టు ప్రాంతాల్లో మునిగిపోయే ప్రాంతాల్లో నాలాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. భారీ వర్షాలతో మునిగిపోతున్న ఇళ్ల యజమానులను ఖాళీ చేయించి వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందజేస్తామని హామీ ఇచ్చారు.





ఫతేనగర్, అల్లాపూర్ డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్

నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టాలి



ఖాజానగర్‌లో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ ఖాజానగర్‌లో రూ.10లక్షల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రోడ్డు మీద నీరు నిల్వకుండా లెవెలింగ్ చూసుకుంటూ ముందస్తు ప్రణాళికతో నిర్మించాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షించుకుంటూ కాలనీని సుందరంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, కైసర్, ఎండీ సుల్తాన్, అబ్దుల్ సలామ్, ఎండీ మహ్మద్ గౌస్, ఇస్మాయిల్, ఫిరోజ్, షఫీ, ఏఈ శ్రావణి, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో అనుమానితుడు

పోలీసులను చూసి పక్క భవనంలోకి దూకి గాయాలపాలు



గాయాలపాలైన ఫణి శ్రీనివాస్

భాగ్యనగర్‌కాలనీ: పోలీసులను చూసి హాస్టల్‌పై నుంచి పక్క భవనంలోకి దూకిన వ్యక్తికి తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ అమలాపురంకు చెందిన ఫణి శ్రీనివాస్ (25) కేపీహెచ్‌బీ కాలనీలోని రోడ్డు నం.3లో శ్రీ బాలాజీ పీజీ హాస్టల్‌లో ఉంటూ అరబిందో సంస్థలో పనిచేస్తున్నాడు. అమలాపురంలో సెప్టెంబర్ మొదటి వారంలో హత్య జరిగింది. ఈ హత్య కేసులో ఫణి శ్రీనివాస్ అనుమానితుడిగా ఉన్నాడు. కేపీహెచ్‌బీలో నివాసం ఉంటున్నట్లు తెలుసుకున్న అమలాపురం పోలీసులు ఈనెల 18వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో హాస్టల్‌కు వచ్చారు. పోలీసులను గమనించిన ఫణి శ్రీనివాస్ హాస్టల్ పక్క భవనంలోకి దూకేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలోని భవనం పక్క భవనం మూడో ఫ్లోర్‌లో పడిపోయాడు. దీంతో కాళ్లు, పక్కటెముకలు విరిగిపోయాయి. స్థానికులు, పోలీసులు తీవ్ర గాయాలపాలైన శ్రీనివాస్‌ను చికిత్స నిమిత్తం ఈఎస్‌ఐ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చేస్తాం

ఏసీపీ మల్లేశం



లక్ష్మీనగర్‌లో అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ లక్ష్మీనగర్‌లో నిర్మించిన అక్రమ నిర్మాణానికి బుధవారం జీహెచ్‌ఎంసీ మూసాపేట సర్కిల్ ఏసీపీ మల్లేశం ఆధ్వర్యంలో కూల్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీసీ ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నామని తెలిపారు. అక్రమ నిర్మాణాలు నిర్మించే వ్యక్తులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ప్రభుత్వ నిబంధనకు లోబడి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మహేందర్, సిబ్బంది రమేష్, నగేష్, తిరుమలేష్ పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమించి గేట్ నిర్మాణం

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ఆంజనేయనగర్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా భవనం నిర్మించడమే కాకుండా రోడ్డును ఆక్రమించి గేట్ నిర్మాణం చేస్తున్నారని స్థానికులు చున్నూ పాషా మాజీ కార్పొరేటర్ బాబురావుకు వినతి పత్రం అందజేశారు. గేట్ నిర్మాణంతో తన ఇంటికి వెళ్లే దారి పూర్తిగా మూతపడిందన్నారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

22 నుంచి కేపీహెచ్‌బీ డివిజన్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర

- కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు
- డివిజన్ కార్యకర్తలతో దిశానిర్దేశం



పాదయాత్ర నేపథ్యంలో కార్యకర్తలకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఈనెల 22వ తేదీ నుంచి పాదయాత్ర చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లుడతూ... ప్రధానంగా కేపీహెచ్‌బీ డివిజన్‌లోఎక్కడైనా ఏమైనా ఇబ్బందులు ఉంటే ఈ పాదయాత్రలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలన్నారు. అదే విధంగా ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే వినతిపత్రాలు ద్వారా ఎమ్మెల్యే కృష్ణారావుకు అందించాలని కోరారు. కేపీహెచ్‌బీ కాలనీలో రూ.వేల కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఎమ్మెల్యే సహకారంతో పూర్తి చేసుకున్నామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపే కార్యక్రమంలో ప్రతి కార్యకర్త పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ సతీష్ అరోరా, బలవంతరెడ్డి, శ్యామల రాజు, సాయిబాబా చౌదరి, రాజేష్, సాయి, పాతూరు గోపి, కట్ట నర్సింగరావు, వెంకట్‌రెడ్డి, శివారెడ్డి, వసంత్‌నగర్, నాగేశ్వరరావు, భవాని, భారతి, రమాదేవి, లతా, హేమ, కాలనీ అసోసియేషన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఆర్సీ బకాయిలు చెల్లించకుంటే వైద్యసేవలు నిలిపివేస్తాం

గాంధీఆస్పత్రి: పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) బకాయిలు చెల్లించకుంటే రాష్ట్రవ్యాప్తంగా వైద్యసేవలు నిలిపివేస్తామని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) ప్రతినిధులు హెచ్చరించారు. టీజీజీడీఏ గాంధీ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ భూపేందర్ రాథోడ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ప్రాంగణంలో బుధవారం వైద్యగర్జన పేరిట నిరసన, ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కరోనా కాలంలో తెలంగాణ ప్రభుత్వ వైద్యులు ప్రాణాలకు తెగించి వైద్యసేవలు అందించారని గుర్తు చేశారు. ప్రభుత్వ వైద్యుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే నిరసన, ఆందోళన కార్యక్రమాలు మరింత ఉధృతం చేసి రాష్ట్రవ్యాప్తంగా వైద్యసేవలను నిలిపివేస్తామన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని వివేక్‌నగర్, న్యూ, ఓల్డ్ బాలాజీ నగర్‌లలో బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాలాజీనగర్‌లో దాదాపు 90శాతం పనులు పూర్తి చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు సత్వరమే పూర్తి చేస్తామన్నారు. ప్రజలకు అందిస్తున్న పింఛన్లు, దళిత బంధు, డబుల్ బెడ్‌రూమ్ వంటి సంక్షేమ పథకాలకు సంబంధించి అన్ని హామీలు నెరవేరుస్తామన్నారు. అర్హులందరికీ తప్పకుండా అన్ని సంక్షేమ పథకాలు అందుతాయని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల పాలిట పెన్నిధిగా నిలుస్తున్నారని అన్నారు. అందుకు నిదర్శనమే ఇటీవల ఎంపికై న డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులే అని అన్నారు. అనంతరం స్థానిక సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు బ్యాగ్‌కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పగుడాల శిరీష, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.





పాదయాత్రలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నేడు ఎమ్మెల్యే పాదయాత్ర

మూసాపేట: కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం ఉదయం 7.30 గంటలకు బాలాజీనగర్ మార్వెల్ అపార్టుమెంట్, కల్యాణ్ జ్యువెలర్స్ పక్క నుంచి పాదయాత్ర చేపట్టనున్నారు. బాలాజీనగర్ మార్వెల్ అపార్టుమెంట్, విజయదుర్గా టిఫిన్ సెంటర్ వరకు.. అక్కడి నుంచి ఎల్‌ఐజీ కనకదుర్గ ఆలయం వరకు... అటు నుంచి మంత్రి నివాసం వరకు... ఆ తర్వాత 60ఫీట్ రోడ్డు నుంచి అపోలో ఫార్మసీ వరకు పర్యటిస్తారు. అదే విధంగా 40 ఫీట్ రోడ్డు నుంచి ఉమెన్స్ పార్కు, డా. వెంకటరావు ఇంటి వరకు పాదయాత్ర కొనసాగుంది.



విద్యార్థులకు బ్యాగ్ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే